క్లుప్తంగా

దివ్యాంగుల ధ్రువపత్రాల పరిశీలన చింతూరులో చేపట్టాలి

ఎటపాక: ప్రభుత్వం ద్వారా పింఛన్లు పొందుతున్న దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల రీవెరిఫికేషన్ డివిజన్ కేంద్రం చింతూరులో చేపట్టాలని గన్నవరం ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ గురువారం ప్రకటనలో కోరారు. ధ్రువపత్రాల పరిశీలనకు దివ్యాంగులను 400 కిలోమీటర్ల దూరం ఉన్న పాడేరులో చేయడం, చాలా ఖర్చుతో కూడుకున్నదన్నారు. పాడేరు వెళ్లేందుకు దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి డివిజన్ కేంద్రంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి పత్రాల పరిశీలన చేయాలని కోరారు.

సరోజినీ నాయుడు సేవలు మరువలేనివి



సరోజినీనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొయ్యూరు: అంతాడ పంచాయతీ కొత్తపల్లిలో గురువారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ గ్రామీణాభివృద్ధి సంక్షేమ సొసైటీ ఆధ్వర్యంలో సరోజినీ నాయుడు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.సొసైటీ ప్రధాన కార్యదర్శి గుమ్ములూరు శ్రీనుబాబు మాట్లాడుతూ సరోజినీ నాయుడు జీవితం ఎందరికో ఆదర్శ ప్రాయంగా నిలుస్తుందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు సత్యవేణి, మాజీ సర్పంచ్ దేవుడు, భగవాన్, చంద్రరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో మృతికి సంతాపం



కెచ్చల సుగుణ (ఫైల్)

వి.ఆర్.పురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న కెచ్చల సుగుణ (52) మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందినట్టు ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. సుగుణ మృతి పట్ల సహచర ఉద్యోగులు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు, పోలీసులు

గంగవరం(అడ్డతీగల): మండల కేంద్రంలోని వై.జంక్షన్‌లో గురువారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పర్యవేక్షణ బృందం సభ్యులైన వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్, ఎంఈవో మల్లేశ్వరరావు, పోలీసులతో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు సోదాలు చేశారు. ఇతర ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం



యువతి తండ్రికి చెక్కును అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జమాల్‌ఖాన్

చింతూరు: స్థానిక బీసీ కాలనీకి చెందిన పేద యువతి వివాహానికి జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ జమాల్‌ఖాన్ రూ.లక్ష ఆర్థిక సాయం చేసి తన ఉదారతను చాటుకున్నారు. స్థానికంగా నివాసముంటున్న రెహమతుల్లా పేదరికంతో తన కుమార్తె వివాహం చేసేందుకు ఇబ్బందులు పడుతున్న తరుణంలో విషయం తెలుసుకున్న జమాల్‌ఖాన్ వారికి ట్రస్ట్ తరఫున ఒక లక్ష ఆర్థిక సాయంతో పాటు ఇంటి నిర్మాణానికి కూడా సాయం చేశారు. ట్రస్ట్ కార్యదర్శి ఇమ్రాన్‌ఖాన్, సభ్యులు నాదర్‌ఖాన్, సుభానీ, అజీజ్, జావేద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



కళాజాత బృందం ప్రదర్శన

గంగవరం(అడ్డతీగల): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం జీవన్‌జ్యోతి, బీమా పథకం, బ్యాంకు రుణాలు తదితర అంశాలపై కళాకారులు నాటిక రూపంలో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్‌బీఐ బీఎం జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.



దోడిపుట్టులో క్యాబేజీ సాగు



వనభసింగిలో కూరగాయల పంట

నాలుగు గ్రామాల్లో సాగుతీరు	
కూరగాయల రకం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
క్యాబేజీ	250
క్యారెట్	86
టమాటా	155
పచ్చిమిర్చి	90
బంగాళాదుంప	140
చిక్కుడు	120
బీర	58
వంగ	115
కాలీఫ్లవర్	110
ఆకుకూరలు	120

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- నాలుగు గ్రామాల్లో 30 ఏళ్లుగా విస్తారంగా సాగు
- విత్తు నుంచి విక్రయం **వరకు** అంతా వారి శ్రమే..
- సరిహద్దు గ్రామాలకు, **ఆశ్రమ** పాఠశాలలకు నిత్యం **సరఫరా**



ముంచంగిపుట్టు వారపు **సంతలో కూరగాయల** అమ్మకాలు చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: ఒకటి, రెండు కాదు మూడు దశాబ్దాలకు పైగా కూరగాయల సాగునే నమ్ముకుని ఆ గ్రామాలు జీవనం సాగిస్తున్నాయి. ఏడాది పొడవునా వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. విత్తు నుంచి విక్రయం వరకు కుటుంబంలోని ప్రతి ఒక్కరూ సాగులో భాగస్వామ్యం అవుతూ జీవనపాధి పొందుతున్నారు. ఆ గ్రామాలే.. ముంచంగిపుట్టు మండలం దోడిపుట్టు, వనభసింగి, నర్సిపుట్టు, పేటమాలిపుట్టులు. కూరగాయల సాగుకు ఈ గ్రామాలు ఆయువుపట్టుగా నిలుస్తున్నాయి. గ్రామాల్లో 30 ఏళ్ల కిందట కూరగాయల సాగు ప్రస్థానం మొదలైంది. ప్రస్తుతం 489 కుటుంబాలు కూరగాయల సాగులో కొనసాగుతున్నాయి.

1,244 ఎకరాల్లో పంటలు

మండలంలోని దోడిపుట్టు, వనభసింగి, నర్సిపుట్టు, పేటమాలిపుట్టు నాలుగు గ్రామాల్లో 981 మంది గిరిజన రైతులు 1,023 ఎకరాల్లో పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. రోజూ ఈ గ్రామాల నుంచి 660 కిలోలకు పైగా అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరల దిగుబడి వస్తుంది. పండించిన కూరగాయలను ముంచంగిపుట్టు, పెదబయలు, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో జరిగే వారపు సంతలతో పాటు ఒడిశాలోని మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, పాడువా గ్రామాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. దీనికి తోడు 58 ఆశ్రమ పాఠశాలలకు సైతం ఇక్కడి నుంచే అవసరమైన కూరగాయలను సరఫరా చేస్తున్నారు.

నాడు ఘనం.. నేడు దైన్యం

ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిస్తే పెట్టుబడి కష్టాలు తీరుతాయని ఆయా గ్రామ రైతులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా సొమ్ము వీరికి సాగు పెట్టుబడిగా ఎంతో ఉపయోగపడేది. పెట్టుబడి సాయంతోపాటు ఆర్బీకేల ద్వారా అందించే నాణ్యమైన విత్తనాలతో పంటలు వేస్తూ, వ్యవసాయ అధికారులిచ్చే సలహాలను పాటిస్తూ అధిక దిగుబడితో లాభాలు సాధించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి సహాయం లేకపోవడంతో పెట్టుబడి కోసం అప్పులు చేస్తూ కూరగాయాల సాగు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు. అప్పుల బారిన పడకుండా ఆర్థికంగా ఆదుకోవాలని కూరగాయలు సాగు చేస్తున్న గిరిజన రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి సాయం అందక ఇబ్బందులు



మా పూర్వీకుల నుంచి కూరగాయల సాగు, అమ్మకాలు చేస్తున్నాము. మాకున్న పొలంలో ఏడాదంతా పండిస్తాం. నాలుగైదు రకాల కూరగాయలు, ఒకటి, రెండు రకాల ఆకుకూరలను సాగు చేస్తాం. ఒక పంట కోతకు వస్తే మరో పంట వేసుకుంటాం. పెట్టుబడి సాయం అందక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించినట్లు రైతు భరోసా అందిస్తే బాగుంటుంది. అప్పులు చేసే బాధ తప్పుతుంది.

–పాంగి లోకేశ్వర్,
రైతు, ముంచంగిపుట్టు మండలం

ఆశాజనకంగా పంట దిగుబడి



వనభసింగి, దోడిపుట్టు, పేటమాలిపుట్టు, నర్సిపుట్టు గ్రామాల గిరిజనులు ఏడాది పొడవునా కూరగాయల సాగునే నమ్ముకొని జీవిస్తున్నారు. సుమారు 1200 ఎకరాల్లో ఈ ఏడాది కూరగాయల సాగు చేస్తున్నారు. వివిధ రకాల పంటలను పండిస్తూ వారపు సంతలకు తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. సాగులో మెలకువలు, వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

– శ్రీనివాసబాబు,
మండల వ్యవసాయశాఖధికారి, ముంచంగిపుట్టు

స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్



మాట్లాడుతున్న ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ సభ్యుడు సమిరెడ్డి మాణిక్యం

సీలేరు: సీలేరులో నూతన ప్రాజెక్టుల నిర్మాణం వల్ల నిర్వాసితులైన వారికి అన్యాయం జరిగితే సహించేది లేదని దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ సభ్యుడు సమిరెడ్డి మాణిక్యం అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మించే పార్వతీ నగర్ గ్రామస్తులను ఆదుకోవాలని, స్థానికులకు ఉపాధి కల్పించాలన్నారు. సుమారు 90 సంవత్సరాలు లీజుకు తీసుకున్న ఏజీ జెన్‌కో తీసుకున్న నిర్ణయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. సీలేరు జల విద్యుత్ కేంద్రం నిర్వాసితులను ఆదుకోవాలన్నారు. నాయకులు ఆనందరావు, సుబ్రహ్మణ్యం, రాజు, మల్లేశ్వరరావు, మనోజ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



తాజంగిలో క్రికెట్ లీగ్ మ్యాచ్‌లను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషదేవి

చింతపల్లి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. తాజంగి పంచాయతీ కేంద్రంలో ప్రీమియం లీగ్–2 క్రికెట్ మ్యాచ్‌లను ఆమె సర్పంచ్ మహేశ్వరితో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరిస్తే ఉపాధి పొందేందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ లీగ్ మ్యాచ్‌లలో సుమారు 10 జట్లు పాల్గొన్నట్టు నిర్వాహకులు కౌసిక్, సురేంద్రసాగర్ తెలిపారు. వైస్ సర్పంచ్ గెమ్మిలిరవి, శెట్టి శంకర్, లక్ష్మణరావు, రామారావు, నారాయణరావు తదతరులు పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని వినతి



తహసీల్దార్ నర్సమ్మకు వినతిపత్రాన్ని అందజేస్తున్న గిరిజన సంఘం నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని బుంగాపుట్టు డీఆర్ డిపో నుంచి ప్రతి నెల రేషన్ సరకులు సక్రమంగా అందేలా చూడాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, గిరిజన సంఘం నేతలు గురువారం తహసీల్దార్ నర్సమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ బుంగాపుట్టు డిపో ద్వారా గత ఏడు నెలలుగా రెండు, మూడు గ్రామాలకు రేషన్ సరకులు అందడం లేదన్నారు. గత నెల రేషన్ సరకులు అందలేదని పత్రికల్లో వార్త ప్రచురితమైన అనంతరం స్పందించిన అధికారులు బియ్యం పంపిణీ చేశారన్నారు. మళ్లీ ఈ నెల బియ్యం అందలేని పరిస్థితి నెలకొందన్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి 290 బియ్యం బస్తాల బియ్యం రావాల్సి ఉండగా 80 బస్తాల బియ్యం మాత్రమే వచ్చాయన్నారు. దీనిపై జీసీసీ అధికారులు కనీస స్పందించకపోవడం దారుణమన్నారు.తక్షణమే బుంగాపుట్టు పంచాయతీలో రేషన్‌దారులకు సక్రమంగా బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని, పంపిణీలో జరుగుతున్న అవకతవకలపై న్యాయ విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.దీనిపై స్పందించిన తహసీల్దార్ నర్సమ్మ మట్లాడుతూ వెంటనే బుంగాపుట్టు డిపోకు వెళ్లి విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారని గిరిజన సంఘం నాయకులు చెప్పారు. లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, నేతలు గాసిరాందొర, నర్సింగ్‌రావుపడాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు

ముంచంగిపుట్టు: మండంలోని పనసపుట్టు పంచాయతీ కడుతల గ్రామంలో ఈనెల 24న నిర్వహించనున్న హోమ్ జైగో పండగను పురస్కరించుకొని మండల స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగగబంధు మాట్లాడుతూ క్రమశిక్షణ, నిరంతర సాధనతోనే క్రీడల్లో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. ఆయన గురువారం క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. గిరిజన క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. జోలాపుట్టు ఎంపీటీసీ సభ్యురాలు కమల, పనసపుట్టు మాజీ సర్పంచ్ ముల్యా, గ్రామ పెద్దలు సీతారాం, రామదాసు, లొక్కిరాం, త్రినాథ్ పాల్గొన్నారు.

కోతుల బెడద అరికట్టాలని వినతి



తహసీల్దార్ శ్రీనివాసరావు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

కూనవరం: మండల కేంద్రంలో కోతులబెడద ఎక్కువైందని, వాటిని అరికట్టాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాసరావుకు గ్రామస్తులు, విద్యార్థులు గురువారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కోతులు దాడి చేసి గాయపరుస్తున్నాయని వారు చెప్పారు. అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ శ్రీనివాసరావు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

చింతూరు: మండల కేంద్రంలోని విఘ్నేశ్వర దత్తాత్రేయ సహిత షిర్డీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

చింతపల్లి: మండల కేంద్రంలోని సాయినగర్‌లో రెండు వారాలుగా తాగునీటి సమస్య ఉన్నా అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సీపీఐ నేతల పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

చింతపల్లి: మండల కేంద్రంలో సీపీఐ నేత నర్సింగరావు సతీమణి జయలక్ష్మి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ, నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులను గురువారం కలిసి పరామర్శించారు. నేతలు రమణ, రెహమాన్, రవికుమార్, క్రాంతికమార్ తదితరులున్నారు.

పీసా చట్టాలపై అవగాహన అవసరం



జీకే వీధిలో పీసా కమిటీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



రంపచోడవరం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసదొర

గూడెంకొత్తవీధి: పీసా కమిటీ సభ్యులు తమ విధులపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. పీసా కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. పీసా కమిటీలకు చట్టం కల్పించిన హక్కులు, అమలు చేయాల్సిన పనులను వివరించారు. ఈవోపీఆర్డీ పాపారావు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పీసా శిక్షణ తరగతుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో వి.సూర్యనారాయణ మూర్తి చెప్పారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 24వ తేదీ ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రోజుకు రెండు బ్యాచ్‌ల చొప్పున 200 మందికి శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు.

చింతపల్లి: పీసా కమిటీలు వారి విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. పీసా కమిటీ సభ్యులకు చింతపల్లిలో గురువారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. డ్వాక్రా సంఘాలు, పీసా కమిటీలకు వేర్వేరుగా అవగాహన కల్పించారు. ఏపీఎం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

రంపచోడవరం: పీసా చట్టంపై సభ్యులు పూర్తిస్థాయి అవగాహన పొందడం ద్వారా గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని ఎంపీడీవో సుండం శ్రీనివాసదొర అన్నారు. రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయం, ఎమార్సీలలో గురువారం పీసా కార్యదర్శి, ఉపాధ్యక్షులు, వార్డు సభ్యులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీవో శ్రీనివాసదొర, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్‌గా పద్మజలు వ్యవహరించారు. 189 మంది సభ్యులకు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాసదొర మాట్లాడుతూ పీసా చట్టం ద్వారా గ్రామాల అభివృద్ధికి అనేక తీర్మానాలు చేసుకోవచ్చన్నారు.

కూనవరం: మండలంలోని టేకులబోరు ఆశ్రమ పాఠశాలలో మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, పీసా కమిటీ సభ్యులకు ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసా కమిటీ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జావిజయ, తహసీల్దార్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు కొమరం పెంటయ్య, బండారు సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యురాలు అనంతలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డతీగల: పీసా చట్టం నియమావళిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎంపీడీవో కె.ఆర్.విజయ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పీసా చట్టం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీసా చట్టం ప్రకారం గ్రామసభ నిర్వహించి ఆ మేరకు తీర్మానించాలన్నారు. సామర్లకోట ఎంప్లాయిస్ ట్రైనింగ్ సెంటర్ రిసోర్స్ పర్సన్‌లు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

మారేడుమిల్లి: మండలానికి సంబంధించి పీసా చట్టంపై కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమైనట్టు ఎంపీడీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు బ్యాచ్‌లు వారిగా శిక్షణ తరుగుతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతుల్లో పీసా చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు

కొయ్యూరు: సభ్యులు గ్రూపుగా ఏర్పడి అడిగిన వెంటనే పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చింతపల్లి ఉపాధి హామీ క్లస్టర్ ఏపీడీ సీతయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆయన వీఆర్పీలతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరికైనా పనులు లేవంటే నేరుగా కార్యాలయానికి వచ్చి చెప్పవచ్చన్నారు. పనుల కల్పనలో భాగంగా నిర్దేశించిన ఫారంపాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణ పనులను పూర్తి చేయించాలని ఆయన వీఆర్పీలను ఆదేశించారు. గోకులం షెడ్లను పూర్తి చేయించాలన్నారు. శ్రమశక్తి సంఘాల గ్రూపుల ఏర్పాటులో జాప్యం చేయరాదన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల పనితీరును పరిశీలించాలని సూచించారు. ఏపీవో అప్పలరాజు మాట్లాడుతూ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

పెదబయలు: మండలం కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సీతగుంట పంచాయతీ పీసా కమిటీ ప్రతినిధులు సన్నిబాబు, దేవరాజు డిమాండ్ చేశారు. వారు గురువారం సమావేశం నిర్వహించారు. రహదారి విస్తరణకు రెండు వారాల క్రితం తహసీల్దార్, అధికారులు సర్వే చేశారని, నేటి వరకు పనులు చేయలేదన్నారు. ఇరుకైన రహదారి వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యల తలెత్తుతోందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విస్తరణ పనులు చేయాలని కోరారు. నేతలు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూతో అప్రమత్తం

గంగవరం(అడ్డతీగల)/మారేడుమిల్లి: ప్రస్తుతం బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో చికెన్, గుడ్లు తీసుకోకపోడం మంచిదని పశు వైద్యాధికారి అప్పన్నబాబు గురువారం తెలిపారు. ఈ వ్యాధి కోళ్ల నుంచి మనుషులకు సోకే ప్రమాదం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మారేడుమిల్లి మండలంలోని బర్డ్‌ఫ్లూ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కలెక్టర్, ఎస్పీ, పీవో, డీఎస్పీల ఆదేశాల మేరకు చికెన్ సెంటర్లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ఎస్‌ఐ సాధిక్ చెప్పారు.

అయ్యన్నపాత్రుడు గిరిజనులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్



పాడేరులో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు



బోర్నగూడెంలో సీపీఐ ఎంఎల్ నాయకులు



ఎటపాకలో మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు నెహ్రూ

సాక్షి,పాడేరు: గిరిజనులకు కీలకమైన 1/70 చట్టం సవరించాలని తప్పుడు వ్యాఖ్యలు చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో ఈనెల 24 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో గిరిజనులకు క్షమాపణ చెప్పించాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థను కించపరిచిన అయ్యన్నను స్పీకర్ పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు నిరసనగా చేపట్టిన బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించిడం అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్‌కు ముందుగానే జీవో నెం.3పై తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఏపీలో తక్షణమే గిరిజన సలహా మండలి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ,బీఎస్పీ నేతుల బుల్లిబాబు,సుర్ల అప్పారావు, మాధవరావు, కిషోర్, బాబుజీ, శేఖర్,గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: గిరిజన చట్టాలపై అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని బోర్నగూడెంలో సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకుడు గణేశ్వరరావు మాట్లాడుతూ మన్యంలో ఖనిజ సంపదను విదేశాలకు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి ఏడు నెలలు కావస్తున్నా ఒక్క పథకం అమలుచేయకపోవడం దారుణమన్నారు. గిరిజన చట్టాలు, మన్యంలో ఖనిజ సంపద జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. అర్జునుడు, కుశల, రాజారెడ్డి, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: గిరిజన చట్టాలను, ఆదివాసీలను అవహేళన చేస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఏపీ ఆదివాసీ జేఏసీ సెంట్రల్ కమిటీ సభ్యులు గురువారం ఆందోళన చేపట్టారు. నాయకుడు మడివి నెహ్రూ మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు తక్షణమే గిరిజనులకు క్షమాపణ చెప్పాలన్నారు. స్పీకర్ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ జేఏసి చైర్మన్ కుంజా శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై విస్తృత ప్రచారం

గూడెంకొత్తవీధి/గంగవరం(అడ్డతీగల): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇందులో భాగంగా జీకే వీధిలో జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు గోపీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడును గెలిపించాలని కోరారు. గంగవరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీషాదేవి తదితరులు ప్రచారం చేశారు.

రైతులకు ప్రత్యేక విశిష్ట సంఖ్య

గూడెంకొత్తవీధి: మండల కేంద్రలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయాకారి మధుసూదనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రత్యేక విశిష్ట నంబర్‌ను అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. దీంతో వారందరికీ సక్రమంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తిస్తాయన్నారు. ఈ మేరకు రైతులందరూ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారాం, డీటీ సత్యనారాయణ పాల్గొన్నారు.